పశుగ్రాసం కోసం పరేషాన్!

- వరికోతకు పెరిగిన యంత్రాల వినియోగం
- గడ్డి ముక్కలవ్వడంతో నిల్వ చేసేందుకు ఇబ్బందులు
- ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 నుంచి రూ.20వేలు
- నియోజకవర్గంలో మొత్తం 1,08,422 పశువులు
- పశువులకు మేతలేక రైతుల అవస్థలు


ఎర్రవల్లిలో వరి పంటను కోస్తున్న హార్వెస్టర్ యంత్రం

ఎర్రవల్లి: వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక పశువులకు గడ్డి దొరకడం ఇబ్బందిగా మారింది. అలంపూర్ నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి విస్తీర్ణం గతేదాదితో పోలిస్తే పెరిగింది. అయినా వరి గడ్డి మాత్రం దొరకడం లేదు. దీనికి కారణం వరి కోతకు కూలీలకు బదులుగా యంత్రాలను ఉపయోగించడమే. యంత్రాల ద్వారా వరిని కోయడం వల్ల గడ్డి మొత్తం ముక్కలుగా రావడంతో కట్టలు కట్టడానికి వీలు లేకపోవడంతో రైతులు గడ్డిని నిల్వ చేయలేకపోతున్నారు. వరిపంట వేసిన గ్రామాల్లో కూలీల కొరతతో పాటుగా కూలీల ఖర్చులు కూడా పెరగడంతో రైతులు వరికోతలకు యంత్రాల వినియోగం పెరిగింది. బోరు మోటార్లు, చెరువుల దగ్గర వరిని సాగు చేసిన రైతులు యంత్రాలతో వరి కోతలు చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతోందని భావిస్తున్నారు. కానీ దీనివల్ల పశువుల మేతకు వరిగడ్డి దొరకడంలేదు. కూలీలతో వరి కోతలు చేపడితే గడ్డి ఇబ్బడి, ముబ్బడిగా ఉండేది. గడ్డిని నిల్వ చేసుకునేందుకు అనుకూలంగా ఉండేది. పశుగ్రాసం కొరత ఉండడంతో గడ్డిని ఆయకట్టు రైతులే నిల్వ ఉంచుకునేందుకు సిద్ధం అవుతున్నారు. దీంతో నీటి వనరులు లేని రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు. దీంతో మరో గత్యంతరం లేక రహదారులకు ఇరువైపులా ఉన్న ఎండుగడ్డి అక్కడక్కడ పంట పొలాల్లో దొరుకుతున్న మొక్కసొప్ప, మొక్క పొట్టుతో సర్దుకుపోతున్నారు.


మునుగాల శివారులో మొక్కపొట్టును తింటున్న పశువులు


యంత్రం కోయడంతో ముక్కలుగా మారిన వరిగడ్డి

అలంపూర్ నియోజకవర్గంలోని పాడి పశువుల వివరాలు..	
ఆవులు	56,298
గేదెలు	52,124
మొత్తం పశువులు	1,08,422

గడ్డి ఎక్కువగా నిల్వ ఉండాలంటే..

యంత్రాలతో గడ్డిని కోసిన తర్వాత కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకుంటే ఏడాదిపాటు గడ్డి సులభంగా నిల్వ ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పొలంలో యంత్రం ద్వారా కోసిన గడ్డిని పనలుగా సేకరించి ఒక్కో పనను గట్టిగా కట్టాలి. అనంతరం ఆ పనలను ఒక ప్రాంతానికి చేర్చి గడ్డిమేటు వేయాలి. గడ్డిమేటు వేసే సమయంలో పైకప్పు ఏటవాలుగా ఉండేలా చూసుకోని పైన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ కవర్లను తప్పకుండా కప్పి ఉంచాలి. దీనివల్ల వర్షాకాలంలో గడ్డిలోకి నీరు వెళ్లకుండా ఉండటంతో పాటు ఎక్కువ కాలం గడ్డి నిల్వ ఉంటుంది.

పశువులకు గడ్డి దొరకడంలేదు..



ప్రస్తుత కాలంలో యంత్రాలతో వరి కోతలు చేపట్టడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూలీలతో వరికోతలు చేపట్టడం వల్ల గడ్డి ఎక్కువగా దొరికేది. కూలీల ద్వారా కోత కోసిన గడ్డి పూర్తిగా రావడంతో నిల్వ చేసేందుకు వీలుగా కూడా సులభంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆయకట్టేతర ప్రాంతాలకు పశుగ్రాసం దొరకడం చాలా కష్టంగా మారింది. – గొల్ల రవికుమార్, రైతు, కారుపాకుల

యంత్రాలు కోసిన గడ్డి పశువులు తినడంలేదు..



కూలీల కొరత వల్ల చాలా మంది రైతులు యంత్రాల ద్వారానే వరి కోతలు కోస్తున్నారు. దీనివల్ల యంత్రాలతో కోసిన గడ్డి చిన్న చిన్న ముక్కలుగా రావడంతో నిల్వ చేయడానికి పనికి రాకుండా పోతోంది. పశువులు కూడా యంత్రాలతో కోసిన గడ్డిని తినడం లేదు. కోత కోసిన ట్రాక్టర్ గడ్డి సుమారు రూ.20 వేల వరకు పలుకుతోంది. దీని వల్ల పశువులను పోషించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – బోయ లక్ష్మన్న, రైతు, సోసనూలు

క్లుప్తంగా

పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య



గద్వాల: దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తి ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో దొడ్డికొమరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ దొడ్డికొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రమేష్, ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సరోజ, తహసీల్దార్ మల్లికార్జున్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నాయకులు అరెస్ట్

అయిజ: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో ప్రభుత్వం చేపట్టిన చర్యలకు నిరసనగా చలో సెక్రటరేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్‌తో పాటు మరికొంత మందిని పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

5 శాతం రాయితీతో పన్ను చెల్లించండి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలో పన్ను చెల్లించని వారు 5 శాతం రాయితీతో చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు 2025–26 వార్షిక సంవత్సరానికి గాను ఇప్పటివరకు పన్ను చెల్లించని వారు 5 శాతం రాయితీతో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు.

విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు ప్రారంభమైన వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మూడు గంటలపాటు కరెంట్ రాకపోవడంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. మూడు గంటల అనంతరం కరెంట్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయంలో నాగప్ప విగ్రహప్రతిష్ఠ



అయిజ: మండలంలోని యాపదిన్నె గ్రామంలో శివాంజనేయ స్వామి ఆలయంలో గురువారం వేదపండితులు నాగప్ప (నాగుపాముల) శిలా విగ్రహాలతో పాటు సుబ్రమణ్యం స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అస్వత్త నారాయణ స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. రావి, వేప చెట్లకు కల్యాణం చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు

గద్వాల: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై సీఎం రేవంత్‌రెడ్డి దాడులు చేయించటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని పీజీ సెంటర్‌లో విద్యార్థులతో మాట్లాడారు. యూనివర్సిటీలో నూతన భవనాలకు స్థలం అవసరమైతే ఎక్కడి నుంచి తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, మాధవ్, ప్రకాష్, మహేష్, పవన్, రాజు, బలిచక్రవర్తి, ధన్‌రాజ్, అభి, నరేంద్ర, బాలు పాల్గొన్నారు.

పెద్దపోతులపాడులో చలివేంద్రం ఏర్పాటు

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామంలో ఎంపీడీఓ భాస్కర్, డీసీసీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఏర్పాటు చేసిన గ్రామ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలులో కీలకపాత్ర

గద్వాల: ప్రభుత్వ సంక్షేభివృద్ధి పథకాల అమలులో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ప్రైవేటు ఫంక్షన్ హాలులో టీఎన్‌జీఓ అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.30వేలు ఇచ్చేలా ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను ఏ తరహాలో గౌరవిస్తారో అంగన్‌వాడీ టీచర్లకు అదేవిధంగా గౌరవం దక్కేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు పున్నారెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇందిర, కార్యదర్శిగా వెంకట్రామమ్మ, కోశాధికారిగా లక్ష్మీరంగమ్మ, వెంకటేశ్వరమ్మ, వరలక్ష్మి, శాంతి, ఉపాధ్యక్షురాలిగా గిరిజ, బీరమ్మ, సుజాత, మహేశ్వరి, కౌన్సిల్ సభ్యులుగా సుమేరా, చిట్టెమ్మ, పుష్ప, కృష్ణవేణి, వెంకటలక్ష్మిలను ఎన్నుకున్నారు. వారిని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పురాతన కట్టడాలను కాపాడాలి


బక్కమ్మ బావిని సందర్శిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: ప్రభుత్వం జోగుళాంబ గద్వాల జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న పురాతన కట్టడాలను కాపాడాలని బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి కోరారు. గురువారం పట్టణ సమీపంలోని అయిజ–తూంకుట రోడ్డు పక్కన ఉన్న పురాతన కట్టడం 'బక్కమ్మ బావి' ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి మాట్లాడారు. గద్వాల సంస్థానాన్ని 1668–1712 మధ్య కాలంలో నల్లసోమనాద్రి (పెద్ద సోమభూపాలుడు) పాలించాడని, ఆయనను చిన్నప్పటి నుంచి పెంచి పోషించిన బక్కమ్మ పేరుమీద అయిజ సమీపంలో బక్కమ్మ బావిని అందంగా మలిచిన రాళ్లతో సుందరంగా నిర్మించారన్నారు. ఇప్పుడు ఆబావి ముళ్ల పొదలతో, మురుగునీటితో దుర్వాసన వెదజల్లుతోందని వాపోయారు. బావి ముందు గతంలో ఆలయాన్ని నిర్మించారని, ఆలయం రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో గతంలో పెకలించారని వాపోయారు. జిల్లాలో పురాతన చారిత్రక నేపథ్యం ఉన్న కోటలను, బావులను దేవాలయాలను ప్రభుత్వం రక్షించాలని కోరారు. కృష్ణానది మధ్యలో ఉన్న నిజాం కొండకోట, గద్వాలలో ఉన్న మట్టికోట, ప్రాగటూరు మట్టి కోట, అలంపూర్, రాజోళి, గట్టు, చిన్న తాండ్రపాడు, దవేబండ గ్రామాల్లో ఉన్న రాతి బురుజులను, పురాతన బావులను పునరుద్ధరించాలని, వాటిని పర్యాటక కేంద్రాలుగా మార్చాలని ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భీమసేన్ రావు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, పేదలకు వరం


కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేస్తున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు

కేటీదొడ్డి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కేటీదొడ్డి మండల కేంద్రానికి సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులను క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, నాయకులు ఉరుకుందు, టీచర్ గోవిందు, శేఖర్, నవీన్‌కుమార్, యుగంధర్, మల్లేష్‌గౌడు, కొండన్న, తదితరులు ఉన్నారు.

మధ్యప్రదేశ్ గురువుకు ఘన స్వాగతం


శాంతినగర్‌లోని రామాలయంలో నర్మదానంద స్వామివారికి శాలువా కప్పి సన్మానం చేస్తున్న భక్తులు

శాంతినగర్: మధ్యప్రదేశ్ నుంచి పాదయాత్రగా శాంతినగర్‌కు వచ్చిన గురువు నర్మదానంద స్వామికి పట్టణ వాసులు, రామాలయ కమిటీ సభ్యులు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గురువు నర్మదానంద స్వామి మాట్లాడుతూ భారతదేశంలోని 52 శక్తి పీఠాలు దర్శించుకుని మధ్యప్రదేశ్‌లోని నర్మదానది మొదలయ్యే ప్రదేశం అమరకంటక్ కుండు శక్తిపీఠం నుంచి మొదలై గుజరాత్ రాష్ట్రంలోని అంబాజీ శక్తిపీఠం మౌంట్‌అబూ దగ్గర పాదయాత్ర ముగుస్తుందని వివరించారు. లోక కల్యాణార్థం 17,500 కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ వచ్చినట్లు స్వామివారు పేర్కొన్నారు.

ధరూరులో బీటీ రోడ్డు పనులు


ధరూరులో రాయచూరు రోడ్డుపై చేపట్టిన బీటీ నిర్మాణ పనులు

ధరూరు: గద్వాల–రాయచూరు అంతర్రాష్ట్ర రహదారిలో భాగంగా ధరూరులో ఏళ్ల తరబడిగా ఉన్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. వైఎస్సార్ చౌరస్తా నుంచి గద్వాల వైపు వెళ్లే ప్రాంతంలో దాదాపు 200 మీటర్ల పొడవునా బీటీ రోడ్డు అంతా లేచి పోయి గుంతలమయంగా తయారై వాహనదారులకు పట్ట పగలే చుక్కలు చేపించిన విషయం తెలిసిందే. ఏటా వర్షాకాలంలో తూతూ మంత్రంగా మట్టిని వేయడంతో సరి పెట్టుకుంటూ వచ్చిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఎట్టకేలకు శుక్రవారం ప్యాచ్ వర్క్‌లో భాగంగా బీటీ వేశారు. ఈ రోడ్డు మూణ్నాళ్ల ముచ్చటేనని అధికారుల తీరు పట్ల పెదవి విరుస్తున్నారు.

సన్నబియ్యం వినియోగించుకోవాలి


కోదండాపురంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయుడు


సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


చెన్నిపాడులో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే విజయుడు

సాక్షి, నెట్‌వర్క్: రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. గురువారం ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులుతో కలిసి రేషన్‌కార్డుదారులకు సన్నబి య్యం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, తహసీల్దార్ నరేష్, ఓటు సుంకన్న, నారాయణ నాయుడు, ఎల్లారెడ్డి, సుధాకరెడ్డి ఉన్నారు.

■ ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. మండలంలోని గోపల్‌దిన్నె, పెద్దదిన్నె, నక్కలపల్లి, మునుగాల, ఉదండాపురం. శివనంపల్లిలో కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

పేదలకు సన్నబియ్యం పంపిణీ : ఎమ్మెల్యే బండ్ల

■ పేదలు సైతం సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉగాది పండుగ కానుకగా సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం గద్వాల జిల్లా కేంద్రంలోని 4,5 వార్డులలో రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. తహసీల్దార్ మల్లికార్జున్, గడ్డం కృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, విజయ్, మురళి, సతీష్, వెంకటేష్ ఉన్నారు.

■ మల్దకల్ రేషన్ షాపు1లో తహసీల్దార్ షాహిదాబేగం, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు.

■ గట్టులోని 1,2,3 రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, తహసీల్దార్ సలిమొద్దీన్ ప్రంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో డీప్యూటీ తహసీల్దార్ విజయ్, ఆర్ఐలు రాజు ఉన్నారు.

■ ఉండవెల్లి మండలంలోని పుల్లూరు, మెన్నిపాడు, కలుగోట్ల, బొంకూరు ఇటిక్యాలపాడు గ్రామాల్లో తహసీల్దార్ ప్రభాకర్, డీటీ వెంకట్రమణ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. పుల్లూరులో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు.

■ ఎర్రవల్లి మండలంలోని వేములలో ఆర్ఐ శ్రీను, బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. ఫ్లెక్సీలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీలర్ రాధ, సుందర్ బాబు, గోపాల్, వెంకటేష్, రామారావు, నరేంద్ర, శివ, తదితరులు ఉన్నారు.

■ మానవపాడు మండలంలోని చెన్నిపాడులో డీసీసీ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బాబు, పంచాయతీ సెక్రటరీ సంధ్యారాణి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాంతన్న, ఖాజా, రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమన్న, యూత్ నాయకులు గణేష్, విశ్వనాథ్‌నాయుడు, నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించుకుందాం


పోస్టర్లు విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ: సంప్రదాయ పరంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. గురువారం మండలంలోని ఈడుగోనిపల్లిలో గ్రామస్తులతో కలిసి శ్రీరామ నవమి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బడేసాబ్, మద్దిలేటి, మైనర్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చింతరేవులలో చలివేంద్రం ప్రారంభం

ధరూరు: వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని చింతరేవులలో గ్రామస్తులు, యూత్ సహకారంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మదన్‌మోహన్ గురువారం చలివేంద్రం ప్రారంభించారు. జూరాల మీదుగా గద్వాల, మక్తల్, నారాయణపేట ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



ఎర్రవల్లి: మండలంలోని జింకలపల్లి గ్రామంలో గురువారం యువత ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో పెద్ద బీసన్న, రాజు, రుషికేష్, శివగోవిందు, రామకృష్ణ, గోవర్ధన్, బాను, శివ, బండ్లేష్ పాల్గొన్నారు.

నేడు ఆలయ భూములకు కౌలు వేలం

ఇటిక్యాల: మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఆలయ భూములను 2025–26 సంవత్సరానికి శుక్రవారం బహిరంగ కౌలు వేలం వేయనున్నట్లు ఆల య ధర్మకర్త జయసింహ గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ. 2వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. కౌలు పొలాన్ని దక్కించుకున్న గుత్తేదారులు వెంటనే 50శా తం నగదును చెల్లించి, రశీదు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఇందిరమ్మ మోడల్ గృహానికి భూమిపూజ

ఇటిక్యాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్మించే ఇందిరమ్మ మోడల్ గృహానికి గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, హౌసింగ్ శాఖ ఏఈ రతన్‌నాయక్ ముగ్గు పోసి భూమి పూజ చేశారు. గ్రామాలలో ఇల్లు లేని వారిని గుర్తించి లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్, మండలాధ్యక్షుడు రుక్మానంద రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, సూర్యకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో వర్షం

- తడిసిన ధాన్యం, పంటలు
- సింధనూర్‌లో వడగండ్ల వాన
- గట్టులో పిడుగుపాటుకు కోడెదూడలు మృత్యువాత


ఉండవెల్లిలో నేలమట్టమైన పొగాకు టెంట్లు.


జలమయమైన రోడ్లు


కలుగోట్లలో టార్పాలిన్లతో కప్పేసిన మిర్చి పంట


గట్టులో పిడుగు పాటుకు మృత్యువాత పడిన కోడెదూడలు

సాక్షి, నెట్‌వర్క్: మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. అయిజ, ఉండవెల్లి, గట్టు, రాజోళి మండలాల్లో వర్షానికి ధాన్యం, పంటలు తడిశాయి. గట్టులో పిడుగుపాటుకు కోడెదూడలు మృత్యువాత పడ్డాయి.

■ మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షానికి మిరప, పొగాకు, జొన్న, మొక్కజొన్న ధాన్యం తడిశాయి. రైతులు తీవ్ర ఇబ్బందులతో కల్లాల్లోని మిరప, పొగాకు, జొన్న తదితర పంటలపై టార్పాలిన్ కవర్లు కప్పారు.

■ అయిజ మండలంలో తేలికపాటి జల్లులు కురిశాయి. వెంకటాపురంలో మోస్తరు వర్షం కురవగా, సింధనూరులో కొన్ని నిమిషాలపాటు వడగండ్ల వాన కురిసింది. ఎండు మిరప, పొగాకు కుప్పలపై రైతులు పరదాలు కప్పి పెట్టారు.

■ గట్టు మండల కేంద్రంలో ఉరుములు, మెరుపుల వర్షం కురవడంతో రైతులకు నష్టాన్ని మిగిల్చింది. గట్టుకు చెందిన సరాబ్బాయి సిద్ధప్ప తన పొలం దగ్గర చెట్టు కింది రెండు కోడెదూడలు కట్టేశాడు. పిడుగు పడడంతో రెండు కోడెదూడలు మృత్యువాత పడ్డాయి.

■ ఉండవెల్లి మండల కేంద్రం, కంచుపాడు, తక్కశిల, కలుగొట్ల, బొంకూరు, ఇటిక్యాలపాడు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. కలుగోట్ల, ఇటిక్యాలపాడు, ఉండవెల్లి గ్రామాల్లో మిర్చి పంట వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచారు. పొగాకు మండలపై కప్పిన టార్పాలిన్లు, చలువ పందిళ్ల నెలమట్టమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో కరెంట్‌కు అంతరాయం ఏర్పడింది.

■ రాజోళి మండల కేంద్రం, మాన్‌దొడ్డి, పచ్చర్ల తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. రైతులు ఆరబోసుకున్న మొక్కజొన్న పూర్తిగా తడిసిపోయింది. పచ్చర్లలో రైతులు అమ్ముకునేందుకు మైదానంలో బస్తాల్లో నింపి పెట్టిన మొక్కజొన్న పూర్తిగా తడిసింది. పచ్చర్ల గ్రామంలోనే 2 టన్నుల మొక్కజొన్న బస్తాలు తడిసినట్లుగా రైతులు తెలిపారు.